క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

నిజాంపేట్: బాచుపల్లి చౌరస్తాలో జరుగుతున్న ఫ్లైఓవర్ నిర్మాణ పనుల నేపథ్యంలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం తలెత్తనుందని బాచుపల్లి సబ్‌స్టేషన్ ఏఈ ఓ ప్రకటనలో తెలియజేశారు. 11 కేవీ ఏసీ టైర్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు మమత ఆస్పత్రి, బాచుపల్లి సిగ్నల్ ఏరియా, మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ఇంద్రనగర్, బాచుపల్లి సిగ్నల్ ఏరియాలోని ప్రధాన రోడ్డులో, అదే విధంగా 11 కేవీ మల్లంపేట్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు రెయిన్‌బో కాలనీ, ప్రణీత్ జెనైత్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

కొంపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో..

కుత్బుల్లాపూర్: కొంపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల రీకండక్టరింగ్ పనుల నేపథ్యంలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో ఆటంకం కలుగనుందని ఏఈ ఓ ప్రకటనలో తెలియజేశారు. 11 కేవీ కొంపల్లి ఫీడర్ పరిధిలో ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు సెంటర్ పార్క్, కుమ్మరి బస్తీ, ఆంధ్రాబస్తీ, కొంపల్లి మున్సిపల్ కార్యాలయ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

నేడు ఇండియన్ స్పేస్ ప్రోగ్రామ్‌పై సదస్సు

నిజాంపేట్: బాచుపల్లిలోని వీఎన్ఆర్ విజ్ఞాన జ్యోతి కళాశాలలో శుక్రవారం ఇండియన్ స్పేస్ ప్రోగ్రామ్‌పై అవగాహన సదస్సు నిర్వహించనున్నారు. ఉదయం 9.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి ఇస్రో, ఎన్ఆర్ఎస్ఈ డైరెక్టర్ జి.శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై స్పేస్ ప్రోగ్రామ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించనున్నారని కళాశాల యాజమాన్యం ఓ ప్రకటనలో తెలియజేసింది.

ములుగు నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా కూన శ్రీశైలంగౌడ్



కుత్బుల్లాపూర్: బీజేపీ రాష్ట్ర అధిష్టానం కూన శ్రీశైలంగౌడ్‌ను ములుగు నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా నియమించింది. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ఆదేశాలతో ఈనెల 8న ప్రధాని మోదీ బహిరంగ సభ నేపథ్యంలో జన సమీకరణ విషయంపై బుధవారం రాత్రి జరిగిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. రెండు రోజుల పాటు ఆ నియోజకవర్గంలో కూన శ్రీశైలం గౌడ్ రాష్ట్ర నాయకులతో కలిసి గురువారం సమావేశాలు ఏర్పాటు చేసి చర్చించారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

లాలాపేట: ఉస్మానియా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం గ్రాడ్యుయేషన్ డే–2023 సందడిగా జరిగింది. ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ ప్రొ. బీఎస్ మూర్తి ముఖ్య అతిథిగా హాజరై ప్రతిభావంతులైన పలువురి విద్యార్థులకు గోల్డ్ మెడల్స్, నగదు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఓయూ వీసీ ప్రొ. రవీందర్, టీఎస్ఎస్‌పీడీసీఎల్ చైర్మెన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ జి. రఘుమారెడ్డి, ఓయూ రిజిస్ట్రార్ ప్రొ లక్ష్మీనారాయణ, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొ. శ్రీరామ్ వెంకటేష్ పాల్గొన్నారు.

జీఓ 58 ప్రకారం ఇళ్ల పట్టాలివ్వాలి

కవాడిగూడ: ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకున్న పేదలకు జీవో 58 ప్రకారం ఇళ్ల పట్టాలు ఇవ్వాలని సీపీఐ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్ పాషా, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డిలు డిమాండ్ చేశారు. ప్రతి ప్రకటన జీవోగా భావించాలని, వాగ్దానాలను అమలు చేసినప్పుడే ప్రజలకు విశ్వాసం కలుగుతుందని, మాట తప్పితే ప్రజల నుంచి తిరుగుబాటు తప్పదని వారు హెచ్చరించారు. ప్రభుత్వ, భూదాన్ భూముల్లో గుడిసెలు వేసుకున్న వారికి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సీపీఐ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రేటర్ హైదరాబాద్‌లో 1432 మురికివాడలు ఉన్నాయని, మరో 450 వరకు ఉంటాయని, అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని చెప్పుతున్న ప్రభుత్వం మురికివాడలను ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను, దళితులకు మూడు ఎకరాల భూమిని, పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, మైనార్టీలకు 12 శాతం రిజర్వేషన్ అమలు చేయాలన్నారు.

9న 'బాల బృందావనం'

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ఆదివారం పిల్లల కోసం 'బాల బృందావనం' కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. 9 –14 ఏళ్ల లోపు వయస్సు కలిగిన పిల్లల కోసం 'బిల్డ్ యువర్ కాన్ఫిడెన్స్' పేరిట ఈ కార్యక్రమాన్ని సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 040–23001234లో సంప్రదించ వచ్చని నిర్వాహకులు తెలిపారు.

డబ్బులు చెల్లిస్తారా.. కూల్చమంటారా?



డబ్బులు చెల్లిస్తారా... లేక కూల్చమంటారా.. ఇవి ప్రభుత్వం ఆదేశాలంటూ బాచుపల్లి రెవెన్యూ అధికారులు పేదలను భయభ్రాంతులకు గురిచేశారు. నిజాంపేట్‌లోని సర్వే నం.334లో జీఓ.59 కింద దరఖాస్తు చేసుకున్న వారి నిర్మాణాలను కూల్చివేసే కార్యక్రమాన్ని గురువారం చేపట్టారు. ఏమి చేయాలో తెలియక దరఖాస్తు దారులు ఆందోళన చెందుతున్నారు.





నిజాంపేట్ సర్వే నం.334లో నిర్మాణాలను కూల్చేస్తున్న అధికారులు

నిజాంపేట్: ప్రభుత్వ స్థలాల్లో నిర్మాణాలు చేసుకున్న వారు ప్రభుత్వం తీసుకుచ్చిన జీఓ.59 ప్రకారం క్రమబద్ధీకరణకు రెండు సార్లు దరఖాస్తు చేసుకున్నారు. అయితే అందులో అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి అర్హులైన వారందరికీ లబ్ధిదారుల ఇంటి విస్తీర్ణాన్ని బట్టి డబ్బులు చెల్లించాలని నోటీసులు జారీ చేశారు. అయితే అందులో స్తోమత కలిగిన వారు వెంటనే చెల్లించారు అలాంటి వారికి రెవెన్యూ అధికారులు రిజిస్ట్రేషన్లు చేశారు. కాగా నోటీసుల్లో పేర్కొన్న డబ్బులు చెల్లించలేని వారిని పలుమార్లు అధికారులు డబ్బులు చెల్లించాలని సూచించారు.

◆ అయినప్పటికీ కొంత మంది ఇప్పటి వరకు డబ్బులు చెల్లించలేదు. దీంతో సడెన్‌గా గురువారం రెవెన్యూ అధికారులు నోటీసులు అందుకుని డబ్బులు చెల్లించలేని వారి ఇండ్ల వద్దకు జేసీబీలను తీసుకొచ్చి కూల్చివేసే కార్యక్రమాన్ని ఆర్ఐ శ్రీదేవి ఆధ్వర్యంలో చేపట్టారు. దీంతో లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు. ఏళ్ల నుంచి ఉంటున్న ఇళ్లను ఇప్పటికిప్పుడు కూల్చేస్తే ఎక్కడికి పోవాలన్నారు. కూల్చివేతలతో సరి పెట్టడమే కాదు అవసరం అయితే జప్తు కూడా చేసుకుంటామని అధికారులు చెప్పడం గమనార్హం.

డబ్బులు చెల్లిండకపోవడానికి గల కారణాలు..

నోటీసులు అందుకున్న లబ్ధిదారులు సకాలంలో డబ్బులు చెల్లించకపోవడానికి పలు కారణాలు చెబుతున్నారు. 2014 ప్రకారం కాకుండా బేసిక్ వాల్యూ ప్రస్తుతం ధర ప్రకారం వేయడంతో లక్షలాది రూపాయాలు చెల్లించాలని నోటీసులు వచ్చాయని పేర్కొంటున్నారు. అంతే కాంకుడా ఒకే విస్తీర్ణం ఉన్న వారికి వివిధ వ్యత్యాసాల్లో నోటీసులు రావడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం పెంచిన ధరను తగ్గిస్తుందని ఆశగా ఎదురు చూస్తున్న తమకు ఇలా కూలుస్తారని అనుకోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆందోళనలో దరఖాస్తుదారులు...

ప్రభుత్వం ఇటీవల చివరి సారిగా అవకాశం ఇచ్చినప్పుడు దరఖాస్తు చేసుకున్నవారి దరఖాస్తులను వారం రోజుల నుంచి అధికారులు పరిశీలించి ప్రభుత్వం రూపొందించిన యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. దీంతో ప్రస్తుతం పత్రాల పరిశీలన ఎదుర్కొంటున్న దరఖాస్తు దారులు ఆందోళన చెందుతున్నారు. రేపు మాకు డిమాండ్ నోటీసులు అందిన తరువాత డబ్బులు చెల్లించకుంటే మా ఇళ్లు కూడా కూల్చీవేస్తారా? అని ఆందోళన చెందుతున్నారు.

అవసరమైతే జప్తు కూడా చేస్తాం..



జీఓ.59 కింద డిమాండ్ నోటీసులు అందుకున్న వారు తప్పని సరిగ్గా డబ్బులు చెల్లించాల్సిందే. లేని పక్షంలో నిర్మాణాలను కూల్చేస్తాం. అంతే కాదు అవసరమైతే జప్తు కూడా చేస్తాం. వెంటనే ఇప్పటి వరకు చెల్లించని వారు వెంటనే చెల్లించాలి లేకపోతే లబ్ధిదారులు నష్టపోతారు.

– సురేందర్, బాచుపల్లి తహసీల్దార్

బాబూ జగ్జీవన్‌రామ్‌కు నివాళి



గాజులరామారం చౌరస్తాలో బాబూజగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కూన శ్రీశైలంగౌడ్

సుభాష్‌నగర్: ఉప ప్రధానిగా రాజ్యాంగ హక్కులను అమలు చేయడంతో పాటు కార్మికుల సంక్షేమానికి పెద్దపీట వేసిన ఘనత బాబు జగ్జీవన్‌రామ్‌కే దక్కుతుందని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతిని పురస్కరించుకుని గురువారం గాజులరామారం చౌరస్తాలో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ.. బాబుజగ్జీవన్‌రావు జీవితాంతం బడుగు, పేద వర్గాల ప్రజల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయుడన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఎం.సాగర్, పత్తి రఘుపతి, మోతె శ్రీనివాస్‌యాదవ్, జ్ఞానేశ్వర్, రాజిరెడ్డి, రామనర్సయ్య, అంజి, సంతోష్, శ్రీనివాస్‌రావు, గోపాల్, మురళి, బాలకృష్ణ, సంతోష్, చందు, టైసన్, నరేందర్‌రెడ్డి, దాస్ శ్రీను, సుజిత్‌రెడ్డి, శ్రీకాంత్, యశ్వంత్, జహంగీర్, సతీష్, ముత్యపాగ విజయ్, రంజిత్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ గర్జన పోస్టర్ ఆవిష్కరణ



ఉమామహేశ్వర ఆలయ ప్రాంగణంలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బ్రాహ్మణ సంఘం సభ్యులు

సుభాష్‌నగర్: సమాజంలో ఆర్థికంగా, సామాజికంగా అణచివేతకు గురవుతున్నది బ్రాహ్మణ వర్గమని శ్రీగాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు గోగులపాటి కృష్ణమోహన్ అన్నారు. ఆత్మగౌరవాన్ని కాపాడుకోవడానికే జూలై 9వ తేదీన సరూర్‌నగర్ గ్రౌండ్‌లో బ్రాహ్మణ గర్జన తలపెట్టామని అన్నారు. గురువారం సూరారం శివాలయనగర్‌లోని ఉమామహేశ్వర ఆలయంలో బ్రాహ్మణ సంఘం సభ్యులు ఆలయ వ్యవస్థాపకుడు ముద్దాపురం మదన్‌గౌడ్‌తో కలిసి బ్రాహ్మణ గర్జన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం సలహాదారుడు సర్వేపల్లి రమేష్‌కుమార్, పరశురామ శర్మ, శివాజీ, సంజీవరావు సూర్యనారాయణ, సురేష్ కుమార్ శర్మ, రవి సుధాకర్ శర్మ, సత్య కుమార్, చింతపట్ల వెంకటరమణాచార్యులు, కసుపర్తి సాయిరాం, మిర్యాల మూర్తి, వినాయకరావు తదితరులు పాల్గొన్నారు.

తోటి ఉద్యోగుల వేధింపులు తాళలేక వ్యక్తి ఆత్మహత్య

దుండిగల్: తోటి ఉద్యోగుల వేధింపులు తాళ లేక ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. డీపోచంపల్లికి చెందిన సింగూరు రవీందర్ (40), మమతలు భార్యాభర్తలు. కాగా రవీందర్ బహదూర్‌పల్లిలోని ఆహ్లాద పరిశ్రమలో పని చేస్తున్నాడు. అతని భార్య స్థానికంగా ఉన్న ఆస్పత్రిలో పని చేస్తోంది. కల్లు తాగే అలవాటు ఉన్న రవీందర్ ఈనెల 5వ తేదీన డ్యూటీకి వెళ్లకుండా ఇంటి వద్దనే ఉన్నాడు. పిల్లలను స్కూల్‌కు పంపిన భార్య మమత డ్యూటీ నిమిత్తం ఆస్పత్రి వెళ్లింది. మధ్యాహ్నం ఇంటికి వచ్చిన ఆమె భర్త బెడ్‌రూమ్‌లో తలుపులు వేసుకోవడంతో నిద్రించడాని భావించి తిరిగి డ్యూటీకి వెళ్లింది. సాయంత్రం డ్యూటీ ముగించుకుని ఇంటికి వచ్చినా భర్త బెడ్‌రూమ్ తలుపులు తీయకపోవడంతో చుట్టు పక్కల వారి సహాయంతో డోర్ తెరిచి చూడగా రవీందర్ సీలింగ్ ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. దీంతో అతడిని కిందకు దింపి చూడగా అప్పటికే మృతి చెందాడు. మృతదేహం వద్ద సూసైడ్ నోట్ లభించగా అందుతో తోటి వర్కర్ల వేధింపుతోనే ఆత్మహత్యకు పాల్పడినట్లు రాసి ఉంది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రూ.30-40 లక్షలు చెల్లించాలని నోటీసులిస్తారా?

- తక్షణమే ఇచ్చిన నోటీసులు వెనక్కు తీసుకోవాలి
- స్పందించకుంటే కలెక్టరేట్‌ను ముట్టడిస్తాం
- రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు రవికుమార్‌యాదవ్

ఆల్విన్‌కాలనీ: ప్రభుత్వ స్థలాలు, షెడ్లు, ఇళ్లు జోఓ.59 కింద క్రమబద్ధీకరిస్తామని మాయమాటలు చెప్పి ఓట్లు వేసి గెలిపించాక మాట మార్చి అమాయక ప్రజలతో ఆడుకుంటున్నారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్ యాదవ్ మండిపడ్డారు. గురువారం ఆయన కూకట్‌పల్లి డివిజన్ పాపిరెడ్డినగర్ హనుమాన్ దేవాలయంలో ఎంఆర్ఓ ఇచ్చిన నోటీసులకు వ్యతిరేకంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు. కొన్ని రోజులుగా డబ్బులు కట్టకపోతే ఇళ్లు కూలుస్తామని.. ప్రభుత్వమే మీ ఇళ్లను జప్తు చేస్తుందని భయభ్రాంతులకు గురి చేస్తున్నారని అన్నారు.

◆ దాదాపు 300 మంది పాపిరెడ్డినగర్, హనుమాన్‌నగర్, దీనబంధుకాలనీ, ప్రగతినగర్, వెంకటేశ్వర్ కాలనీలకు చెందిన వారికి నోటీసులు ఇచ్చి డబ్బులు వసూలు చేయాలనుకోవటం ఎంత వరకు సబబు అని ప్రశ్నించారు. పేద ప్రజలందరికి అండగా ఉంటామని దీనిపై న్యాయపోరాటం చేసి అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధుల బండారం బయటపెడదామని ప్రజలకు ధైర్యం చెప్పారు.

◆ ఒక్కో ఇంటికి రూ.30 – 40 లక్షలు చెల్లించాలని నోటీసులు అందించి వారి జీవితాలతో ఆడుకుంటున్నారని అన్నారు. తక్షణమే ఇచ్చిన నోటీసులు వెనక్కు తీసుకోవాలన్నారు. లేకుంటే కలెక్టరేట్, రెవెన్యూ కార్యాలయాలను బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అల్లూరి రామరాజు, భూపాల్‌రెడ్డి, పర్వతాలు యాదవ్, వెంకటేష్, శ్రీనివాస్ పటేల్, శ్రీధర్ పటేల్, బాలు యాదవ్, రాజిరెడిడ్డ, గోవర్ధన్‌చారి, తదితరులు పాల్గొన్నారు.



పలు కాలనీ వాసుల సమావేశంలో పాల్గొన్న రవికుమార్‌యాదవ్ తదితరులు

సివిల్స్ పరీక్ష అభ్యర్థులకు 9న ఉచిత వర్క్‌షాప్

చిక్కడపల్లి: డాక్టర్ ఎస్ శ్రీధర్స్ ఐఏఎస్ అకాడమీ ఆధ్వర్యంలో సివిల్ సర్వీసెస్ పరీక్షకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు ఈనెల 9న ఉచిత వర్క్‌షాప్ నిర్వహిస్తున్నామని అకాడమీ డైరెక్టర్ నాగ శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. అశోక్‌నగర్‌లోని అకాడమీలో ఆదివారం జరిగే ఈ వర్క్‌షాప్‌లో ప్రముఖ విద్యావేత్త, పోటీ పరీక్షనిపుణులైన ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చింత గణేశ్, ఇతర నిపుణులు పాల్గొంటారని తెలిపారు. వివరాల కోసం 83749 38606 నెంబరుకు ఫోన్ చేయవచ్చన్నారు.

నేటి నుంచి బీజీసీఐ-2023 అంతర్జాతీయ సమావేశం

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో బోర్డ్ ఆఫ్ జెనెటిక్స్ కౌన్సెలింగ్ ఇండియా (బీజీసీఐ)-2023 అంతర్జాతీయ సమావేశాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. హెచ్‌సీయూలోని స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్ బీజీసీఐ సంయుక్తంగా 8వ వార్షిక అంతర్జాతీయ కాన్ఫరెన్స్‌ను జూలై 7 నుంచి 9వ తేదీ వరకు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ సమావేశంలో పరిశోధకులు, జన్యు సలహాదారులు, నిపుణులు, వైద్యులు, ఆరోగ్య సంరక్షణ ప్రదాతలు, పరిశ్రమలు, జన్యుశాస్త్రం, జెనోమిక్స్‌లలో విద్యను ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకుంది. 14 మంది అంతర్జాతీయ, 52 మంది జాతీయ నిపుణులు పాల్గొంటారు.

'మనూ'లో డిస్టెన్స్‌లో బీఈడీ

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో డైరెక్టరేట్ ఆఫ్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్(డీడీఈ) ద్వారా డిప్లొమా ఇన్ ఎడ్యుకేషన్ పూర్తి చేసిన సర్వీస్ టీచర్ల కోసం బీఈడీ కోర్సుకు దూరవిద్య ద్వారా ప్రవేశాలు కల్పిస్తున్నట్లు డీడీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ మహ్మద్ రజావుల్లాఖాన్ పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి జూలై 25 చివరితేదీ. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలి. అవసరమైన పత్రాలు జతచేసి, రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాలన్నారు. అర్హత, ఇతర వివరాలకోసం యూనివర్సిటీ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ వెబ్‌సైట్‌లో చూడాలి.

'మనూ'ను సందర్శించిన ఫ్రాన్స్ బృందం

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంను ఫ్రాన్స్ ఉన్నతస్థాయి బృందం గురువారం పరిశీలించింది. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలో నీటి నిర్వహణను ఈ బృందం పరిశీలించింది. అర్బన్ వాటర్ మేనేజ్‌మెంట్‌పై తెలంగాణ ప్రభుత్వంతో కలిసి ప్రాజెక్టును అభివృద్ధి చేయడానికి ఫ్రెంచ్ ప్రతినిధి బృందం హైదరాబాద్‌ను సందర్శిస్తోంది. అందులో భాగంగా మనూ వీసీ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్‌తో ఫ్రాన్స్ బృందం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా యూనివర్శిటీ క్యాంపస్‌లో నీటి సంరక్షణ, నిర్వహణపై చేపడుతున్న ప్రత్యేక కార్యక్రమాల గురించి వైస్‌ఛాన్సలర్ వారికి వివరించారు. 'మనూ'లో నీటి నిర్వహణపై మనూ జల్‌శక్తి కమిటీ చైర్మన్ ప్రొఫెసర్ షకీల్ అహ్మద్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేశారు. కార్యక్రమంలో ప్రొ.మహ్మద్ ఫరియాద్, ప్రొఫెసర్ సల్మా అహ్మద్ ఫారూఖీ, ప్రొఫెసర్ సల్మాన్, డాక్టర్ పండిట్ మధుర్నే, శ్రీనివాస్ బైరీ పాల్గొన్నారు.

మనూ-అలయన్స్ ఫ్రాంకైస్ ఒప్పందం

రాయదుర్గం: మనూ- అలయన్స్ ఫ్రాన్‌కై స్ (ఏఎఫ్) హైదరాబాద్ మధ్య ఒప్పందం కుదిరింది. గురువారం గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలోని స్కూల్ ఆఫ్ లాంగ్వేజెస్, లింగ్విస్టిక్స్ అండ్ ఇండాలజీ విద్యార్థులకు ఫ్రెంచ్ భాషను బోధించడానికి ఫ్యాకల్టీ సభ్యులను అందించేందుకు ఈ ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు. మనూ స్కూల్ ఆఫ్ లాంగ్వేజెస్, లింగ్విస్టిక్స్ అండ్ ఇండాలజీ డీన్ ప్రొఫెసర్ అజీజ్‌బానో, హైదరాబాద్‌లోని అలయన్స్ ఫ్రాంకైస్‌లోని కోర్సు డైరెక్టర్ సంతకాలు చేశారు. అలయన్స్ ఫ్రాంకైస్ హైదరాబాద్ ఫ్రెంచ్ భాష బోధించడానికి అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన కేంద్రం. దీనికి దేశవ్యాప్తంగా 13 కేంద్రాలు ఉన్నాయి.

అట్రాసిటీ కేసుల్లో బాధితులకు సత్వర న్యాయం



కలెక్టర్ అమయ్‌కుమార్

సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులతో పాటు వివిధ కేసుల్లో బాధితులకు సత్వర న్యాయం జరిగేలా సంబంధిత శాఖల అధికారులు అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అమయ్ కుమార్ అన్నారు. కేసులను కూడా వేగవంతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాస్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని ఆయన నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ కేసులకు సంబంధించి ఎప్పటికప్పుడు చార్జిషీట్ దాఖలు చేయడంతో పాటు నిర్ణీత సమయంలోగా కేసులను పూర్తి చేసి బాధితులకు న్యాయం చేయాలని సూచించారు. అట్రాసిటీతో పాటు వివిధ కేసుల్లో పురోగతి తదితర వివరాలను సంబంధిత అధికారులను ఆయన అడిగి తెలుసుకున్నారు. అధికారులు సమన్వయంతో బాధితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. గ్రామాల్లో కుల, సామాజిక బహిష్కరణలు విధించడంతో పాటు చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే వారిపై కేసులు నమోదు చేసి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. బాధితులకు ప్రభుత్వం తరఫున అందించాల్సిన ఆర్థిక సాయాన్ని సకాలంలో అందేలా చూడాలని పేర్కొన్నారు. కమిటీ సభ్యులు కూడా క్షేత్రస్థాయిలో అట్రాసిటీ అంశాలతో ముడిపడి ఉన్న ఘటనలను ఎప్పటికప్పుడు తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి, డీసీపీ జానకి, ఇన్‌చార్జ్ డీఆర్‌ఓ చంద్రావతి, జిల్లా ఎస్సీ సంక్షేమ అధికారులు వినోద్, బాలాజీ, ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు రాజు, వస్తాద్, ధనరాజ్ నాయక్, సఫాయి కర్మచారి సభ్యులు వెంకటేశ్వర్లు, జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కారానికి కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ నీలారెడ్డి

నిజాంపేట్: కాలనీలు, బస్తీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించే దిశగా అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలని నిజాంపేట్ మేయర్ కొలన్ నీలారెడ్డి అన్నారు. గురువారం నిజాంపేట్ కార్పొరేషన్ కౌన్సిల్ హాలులో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. అదే విధంగా బోనాల ఉత్సవాల నేపథ్యంలో ఆలయాల వద్ద ఏర్పాట్లను పర్యవేక్షించి విజయవంతంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో కమిషనర్ రామకృష్ణరావు, ఎస్ఇ సత్యనారాయణ, కార్పొరేటర్లు ఆగం పాండుముదిరాజ్, కొలన్ వీరేందర్‌రెడ్డి, కో.ఆప్షన్ సభ్యులు, ఆయా విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ముగిసిన సైనికాధికారుల రీసెర్చ్ మెథడాలజీ శిక్షణ



లాలాపేట: ఉస్మానియా యూనివర్సిటీ నుంచి ఇంటర్నేషనల్ రిలేషన్స్‌లో మాస్టర్స్ చదువుతున్న సైనిక అధికారులకు ప్రత్యేకంగా నిర్వహిస్తున్న హయ్యర్ ఎయిర్ కమాండ్ కోర్సులో బాగంగా ఈ నెల 3 నుంచి కొనసాగుతున్న రీసెర్చ్ మెథడాలజీ క్యాప్సూల్స్–2023 శిక్షణ గురువారం ముగిసింది. ఓయూ ఆర్ట్స్ కళాశాల రాజనీతి శాస్త్రం విభాగం సెమినార్ హాల్లో జరిగిన ఈ ముగింపు కార్యక్రమంలో వైమానిక, సైన్యం, నేవీ తదితర రంగాలకు చెందిన సుమారు 43 మంది అధికారులు పాల్గొన్నారు. వారి పరిశోధన అనుభవాలను ఓయూ ప్రొఫెసర్ల సమక్షంలో వివరించారు. నాణ్యమైన పరిశోధనలపై దృష్టి పెడుతూనే దేశ సరిహద్దుల రక్షణలో సంయుక్త బలగాల కృషిని ఈ సందర్భంగా పలువురు ఓయూ ప్రొఫెసర్లు కొనియాడారు.

వైద్య రంగానికి ప్రభుత్వం పెద్దపీట



సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్, బీఆర్ఎస్ కార్యకర్తలు

కుత్బుల్లాపూర్: వైద్య రంగానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని... దేశంలోనే అన్ని జిల్లాల్లో ప్రభుత్వ వైద్యశాలలు ఉన్న రాష్ట్రంగా తెలంగాణ చరిత్ర సృష్టించబోతోందని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. సీఎం కేసీఆర్ కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి ప్రభుత్వ వైద్యశాలను ప్రకటించిన నేపథ్యంలో గురువారం చింతల్‌లోని పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో బీఆర్ఎస్ శ్రేణులు కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రభుత్వ వైద్య కళాశాల అందుబాటులోకి వస్తే మేడ్చల్ జిల్లా వ్యాప్తంగా ఉన్న విద్యార్థులకు సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. ప్రత్యేక జీవో 87 ద్వారా 100 ఎంబీబీఎస్ సీట్లతో కళాశాలను మంజూరు చేయించిన సీఎంకు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ప్రజలు రుణపడి ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రంగారెడ్డినగర్ డివిజన్‌లో ప్రగతియాత్ర

రంగారెడ్డినగర్: ప్రజా సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తూ సంక్షేమ, అభివృద్ధి పథకాలను అమలు చేస్తోందని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. రంగారెడ్డినగర్ డివిజన్‌లో ఆయన గురువారం కార్పొరేటర్ విజయశేఖర్‌గౌడ్‌తో కలిసి ప్రగతియాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా గుడెన్‌మెట్, సుమిత్రనగర్‌లలో పర్యటించిన ఎమ్మెల్యే స్థానికంగా నెలకొన్న సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మిగిలి ఉన్న డ్రైనేజీ, సీసీ రోడ్లు, విద్యుత్ పోల్స్ ఏర్పాటు తదితర పనులను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. వారి వెంట స్థానిక బీఆర్ఎస్ నాయకులు, అధికారులు ఉన్నారు.